క్లుప్తంగా

తిరుమల బాలాజీకి విశేష అభిషేకాలు



స్వామి వారికి అభిషేకం చేస్తున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో బాలాజీకి శనివారం సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం విశేష అభిషేకాలు, పూజలు చేశారు. పరిసర ప్రాంత భక్తులు పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

హోమియో వైద్యశిబిరానికి స్పందన



హోమియో క్లినిక్‌లో రోటరీ క్లబ్ సభ్యులు

పెదగంట్యాడ: దీర్ఘకాలిక రోగాలను హోమియో మందులతోనే నివారించగలమని డాక్టర్ ఆస్నా అన్నారు. స్థానిక సమతానగర్‌లోని రోటరీ ఉచిత హోమియో క్లినిక్‌లో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. 54 మంది రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విక్టర్ రాజు, లక్ష్మణరావు, రామకృష్ణ, సూర్యనారాయణ, హిమంతరావు పాల్గొన్నారు.

నిర్వాసిత కాలనీల్లో పాదయాత్ర నేడు

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు 900వ రోజుకు చేరుకుంటున్న సందర్భంగా ఆదివారం ఉక్కు నిర్వాసిత కాలనీల్లో పాదయాత్ర చేపట్టనున్నామని మంత్రి రాజశేఖర్, గొందేశి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటలకు పెదగంట్యాడ జంక్షన్ వద్ద పాదయాత్ర ప్రారంభమవుతుందని తెలియజేశారు. కార్మిక సంఘ నాయకులు, ఉక్కు ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పత్రీజీ ఆశయ సాధనకు కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న పరిమళ పత్రి

ఉక్కునగరం: బ్రహ్మర్షి పత్రీజీ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పత్రీజీ పిరమిడ్ స్పిరిట్యువల్ ట్రస్ట్ గ్లోబల్ ఫౌండర్ పరిమళ పత్రి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నవకాంత్ కోరారు. పత్రీజీ ఆరాధనోత్సవాల్లో భాగంగా స్థానిక ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ధ్యానం ద్వారా అనేక ప్రయోజనాలున్నాయన్నారు. సుమారు 50 దేశాల్లో పిరమిడ్ ట్రస్టు ద్వారా ధ్యానం అందిస్తున్నామన్నారు. ట్రస్ట్ సభ్యులు రేవతి దేవి, ఇందిరా లక్ష్మి, శివగణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథస్వామి ఆలయంలో ఏకాదశి పూజలు



విష్ణు సహస్ర నామ పారాయణం చేస్తున్న సమితి ప్రతినిధులు

అగనంపూడి: ఏకాదశిని పురస్కరించుకుని అగనంపూడి సత్రం కూడలిలోని జగన్నాథస్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. భ్రమరాంబ పారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో లలిత, విష్ణు సహస్ర పారాయణం చేశారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ జెర్రిపోతుల సమర, దేవాలయ పూర్వీకులు గురు గోవింద్, మోహన్, సురేష్, మహాత్మాగాంధీ సేవా సమితి అధ్యక్షుడు చిత్తా రామారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఈట్ రైట్ మేళా'



మిల్లెట్స్ మేళాలో స్టాల్‌ను పరిశీలిస్తున్న సీఎండీ భట్



వాకథాన్‌లో పాల్గొన్న ఉక్కు నగర వాసులు

- మిల్లెట్ మేళాలో ఆకట్టుకున్న స్టాల్స్
- అధిక సంఖ్యలో హాజరైన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఈట్ రైట్ మిల్లెట్ మేళాకు విశేష స్పందన లభించింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ), స్టీల్‌ప్లాంట్ సంయుక్తంగా ఉక్కు మల్టీపర్పస్ హాల్లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, ఎఫ్ఎస్ఎస్ఏఐ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అరుల్ ఆనంద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అతుల్ భట్ మాట్లాడుతూ ప్రజల్లో పెరుగుతున్న ఆరోగ్య స్పృహతో చిరు ధాన్యాలకు డిమాండ్ పెరిగిందన్నారు. దైనందిన జీవితంలో మిల్లెట్స్ వినియోగం, ప్రాధాన్యం గురించి డాక్టర్ అరుల్ ఆనంద్, సదరన్ ఇంటర్నేషనల్ హోటల్ మేనేజ్‌మెంట్ అకాడమీ ప్రిన్సిపాల్ జి. జయలక్ష్మి, క్యూ1 ఇంటర్నేషనల్ ఫుడ్స్ సీఈఓ ఎస్. సుజాత శ్రీనివాస్, విశాఖ డెయిరీ ఎండీ ఎస్.వి.రమణ, శ్రావణ్ షిప్పింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ జి. సాంబశివరావు తదితరులు వివరించారు. మేళాలో సృష్టి వరల్డ్ పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన మిల్లెట్లు, మిలెట్లతో చేసిన వంటకాలను సీఎండీ అతుల్‌భట్ అభినందించారు.

ఉక్కు సెక్టార్లలో 'వాకథాన్'

ఈట్ రైట్ ఇండియా – 'సురక్షితంగా తినండి– ఆరోగ్యంగా తినండి– స్థిరంగా తినండి' నినాదంతో ఉక్కునగరంలో శనివారం ఉదయం నిర్వహించిన వాకథాన్ ఉత్సాహంగా సాగింది. ముందుగా స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) డి.కె.మొహంతి, డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే జెండా ఊపి వాకథాన్ ప్రారంభించారు. సెక్టార్– 5 నుంచి సెక్టార్–1 మీదుగా అంబేడ్కర్ కళాక్షేత్రం గుండా సెక్టార్–6 వరకు వాకథాన్ సాగింది. అంతకు ముందు క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

గాజువాక: గాజువాక ప్రాంతంలోని ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు బోధనపై ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ సహకారంతో గాజువాక ఇండస్ట్రియల్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (జిప్సా) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ సబ్జెక్టులలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు పలు అంశాలను వివరించారు. జిప్సా అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం నిర్వహణకు సహకరించిన మండల విద్యాశాఖాధికారి ఎం.సునీతకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిప్సా నాయకులు బి.శ్రీనివాసరావు, దాసరి శ్రీనివాస్, రవి కుమార్, రాము, మురళి తదితరులు పాల్గొన్నారు.

నూతన డీఆర్‌ఎంకు అభినందనలు



డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్‌ను అభినందిస్తున్న స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారులు

ఉక్కునగరం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ నూతన డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌కు స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఇన్‌చార్జ్ బి.కె. మొహంతి నేతృత్వంలో సీజీఎం (మిల్స్, లాజిస్టిక్స్ అండ్ వర్క్స్ కాంట్రాక్ట్) యు.శ్రీధర్, మార్కెటింగ్ ఇన్‌చార్జ్ జీఎం, సీడీవై జీఎం ఇన్‌చార్జ్‌లు డీఆర్‌ఎంను ఆయన కార్యాలయంలో కలిశారు. రైల్వే, స్టీల్‌ప్లాంట్ మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. స్టీల్‌ప్లాంట్‌కు సహకారం అందించాలని కోరారు.

కాంట్రాక్టు కార్మికుల ఆందోళన

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఎంఎంఎస్‌ఎం, డబ్ల్యూఆర్‌ఎం విభాగాధిపతుల కార్యాలయాల వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ కార్మికులకు ప్రత్యేక అలవెన్సులు చెల్లించాలని, స్కిల్డ్ కార్మికులకు బోనస్, ఎక్స్‌గ్రేషియా అమలు చేయాలని కోరారు. ఆయా విభాగాధిపతులకు వినతిపత్రాలు అందజేశారు. పిట్టారెడ్డి, నందికి తాతారావు, నమ్మి రమణ, జి. శ్రీనివాసరావు, అవతారం తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి కృషి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న పురందేశ్వరి

గాజువాక: బీజేపీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా కార్యకర్తలు పని చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. గాజువాకలో శనివారం నిర్వహించిన బీజేపీ బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ప్రముఖ్‌ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలకు సుపరిపాలన అందించాలన్న లక్ష్యంతో ప్రధాని మోదీ పని చేస్తున్నారని, ఆయన ఆశయానికనుగుణంగా రాష్ట్రంలో బీజేపీ పని చేయాలని కోరారు. గాజువాకలో ఇంతమంది కార్యకర్తలను చూస్తుంటే పార్టీకి కొండంత బలం వచ్చినట్టుగా అనిపించిందన్నారు. అనంతరం వివిధ పరిశ్రమలకు చెందిన నాయకుల నుంచి ఆమె వినతి పత్రాలను స్వీకరించారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు పురందేశ్వరిని గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీ జీవీఎల్ నర్సింహారావు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, నాయకులు సూర్యనారాయణరాజు, పుట్ట గంగయ్య, దీనంకొండ కృష్ణంరాజు, బాటా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ మారణకాండపై నిరసన



మణిపూర్ ఘటనపై నిరసన తెలుపుతున్న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు

కూర్మన్నపాలెం: మణిపూర్ మారణకాండపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఈ ఘటనను నిరసిస్తూ కూర్మన్నపాలెం జంక్షన్‌లోని మహనీయుల విగ్రహాల వద్ద ఉన్న విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం నిరసన తెలిపారు. ముందుగా స్టీల్‌ప్లాంట్ డీజీఎం బత్తుల శ్రీనివాసరావు, అంబటి సర్వేశ్వరరావు, సబ్బవరపు అప్పలరాజు, కె.బి.ఆర్.అంబేద్కర్, గుంట్ల శ్రీను తదితరులు జంక్షన్‌లోని మహాత్మా జ్యోతిరావ్‌పూలే, అంబేడ్కర్, బిర్సాముండా, మహాకవి జాషువా విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మణిపూర్‌లోని గిరిజన ఆదివాసీలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు ప్రభుత్వ పాలనా తీరుకు నిదర్శనమన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న సంఘటనలు ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటు అని, ఘటనకు బాధ్యత వహించి ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.ఎ.స్వామి, కుర్మ యోహాన్, డి.శరత్ బాబు, నందికోళ్ల అప్పారావు, ఈర్ల శ్రీరాములు, గాలి రమణమ్మ, పి.ముత్యాలు, పట్నాల రాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణరక్షణ



హెల్మెట్ ధరించాలని ప్రచారం చేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

అగనంపూడి: ద్విచక్రవాహనాలు నడిపేవారు విధిగా హెల్మెట్ ధరించాలని లయన్స్ క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ గుదే సునీలా గజేంద్రరావు, జోనల్ అధ్యక్షుడు కిడిమి హనుమంతురావు, వైద్యులు డాక్టర్ వి.వి.రామారావు అన్నారు. హెల్మెట్ వాడకంపై లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అగనంపూడి కూడలిలో శనివారం అవగాహన, ప్రచార కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులతో పాటు వెనుక కూర్చున్నవారు కూడా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో అత్యధికంగా హెల్మెట్ ధరించని వారే మృత్యువాత పడుతున్నారన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎం.మస్తాన్‌రెడ్డి, వై.నాగ దుర్గా ప్రసాద్, బలిరెడ్డి సత్యనారాయణ, తలారి వెంకటరమణ, ఎర్ని నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడికి తీవ్ర గాయాలు



క్షతగాత్రుడు నాగరాజు

కూర్మన్నపాలెం: విధి నిర్వహణలో ఓ పారిశుధ్య కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలివి.. 86వ వార్డు రాజీవ్‌నగర్‌లో డంపర్‌బిన్లు అన్‌లోడ్ చేసే హైడ్రా లాక్‌ను లారీ డ్రైవర్ వెనుకకు నడుపుతున్న క్రమంలో పక్కన ఉన్న రిలయన్స్ నెట్‌వర్క్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో వెనుకవైపు నిలబడ్డ పారిశుధ్య కార్మికుడు నాగరాజు కాళ్లు లారీకి, స్తంభానికి మధ్య ఇరుక్కుపోవడంతో అతడి కాలికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని అగనంపూడి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు.

డిప్లొమా పారామెడికల్ కోర్సుల గడువు పొడిగింపు

అక్కిరెడ్డిపాలెం: డిప్లొమా పారామెడికల్ కోర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు ఏపీ స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్ కౌన్సిల్ గడువును పొడిగించినట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. 14 డిప్లొమా పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి ఇంటర్ పాసైన అభ్యర్థులు అర్హులని తెలియజేశారు. డిప్లొమా ఇన్ అనస్థీషియా, ఎం.ఎల్.టి, రేడియాలజీ, ఆప్తో మెట్రి టెక్నీషియన్, ఆప్తాల్మిక్ అసిస్టెంట్, ఆడియో మెట్రి టెక్నీషియన్, డీఎంఎస్‌టీ, కార్డియాలజీ, క్యాథ్ ల్యాబ్, డయాలసిస్, రెస్పిరేటరీ థెరపీ, పెర్ఫ్యూజన్, మల్టిపర్పస్ హెల్త్ అసిస్టెంట్ కోర్సుల్లో అడ్మిషన్లు యథావిధిగా జరుగుతాయన్నారు. కన్వీనర్ కోటాకు ఆగస్టు 19 వరకు, మేనేజ్‌మెంట్ కోటాకు సెప్టెంబర్ 14వ తేదీ వరకు గడువు పొడిగించారని తెలియజేశారు. కన్వీనర్ కోటాలో అడ్మిషన్ తీసుకున్న వారికి ఫీజ్ రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందన్నారు. వివరాలకు షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలోని బొల్లినేని మెడిస్కిల్స్‌లో నేరుగా లేదా 7207953919, 7995013421 నంబర్లలో ఫోన్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఏయూ రిజిస్ట్రార్

పెదగంట్యాడ: విద్యార్థినులు కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ ఆకాంక్షించారు. చైతన్య మహిళా, డిగ్రీ, పీజీ కళాశాల 27వ వార్షికోత్సవాన్ని స్థానిక బీసీ రోడ్డులోని టీఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలను ప్రారంభించిన రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రమహలక్ష్మి అకడమిక్ నివేదికను వివరించారు. శకుంతల, విజయలక్ష్మి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



గ్రీన్‌లాండ్ కాలనీలో మొక్కలు నాటుతున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కూర్మన్నపాలెం: పర్యావరణ పరిరక్షణలో భాగంగా కూర్మన్నపాలెం లయన్స్ క్లబ్ సభ్యులు శనివారం 86వ వార్డు వుడా ఫేజ్–6లోని గ్రీన్‌లాండ్ కాలనీలో 200 రకాల మొక్కలు నాటారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి దామా సుబ్బారావు, లయన్స్ క్లబ్ సెక్రటరీ కె.వీ.ప్రసాద్, కె.శంకరరావు, సీతారామరాజు, సుధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బావుల్లో లార్వా నిర్మూలనకు చర్యలు



డెంగ్యూపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ పులి లక్ష్మీబాయ్, ఆరోగ్య కేంద్రం సిబ్బంది

పెదగంట్యాడ: వర్షాలు పడుతున్న నేపథ్యంలో డెంగ్యూ ప్రబలే ప్రమాదం ఉందని 75వ కార్పొరేటర్ పులి లక్ష్మీబాయ్ అన్నారు. జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కులో పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో కలసి డెంగ్యూ వ్యాధిపై శనివారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ దోమల కారణంగా డెంగ్యూ, మలేరియా, బోదకాలు వంటి వ్యాధులు వస్తాయన్నారు. ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. వారంలో ఒక రోజు డ్రై డే పాటించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. రోడ్లపై, కాలువల్లో చెత్తాచెదారం వేయవద్దని, రోజూ ఇళ్ల వద్దకు వచ్చే శానిటరీ సిబ్బందికి చెత్తను అందజేయాలని కోరారు. అనంతరం బావుల్లో గంబూసియా చేపలను విడిచిపెట్టారు. కార్యక్రమంలో పులి వెంకట రమణారెడ్డి, హేమ మాధురి, అమ్మాజీ పాల్గొన్నారు.

అక్టోబర్‌లోగా ఓటర్ల రేషనలైజేషన్

చకచకా సాగుతున్న సర్వే



సర్వేలో పాల్గొన్న ఈఆర్వో లక్ష్మారెడ్డి

గాజువాక: కొత్త ఓటర్ల నమోదుతో పాటు, ఓటర్ల జాబితాల్లోని మార్పులు, చేర్పులకు సర్వే చకచకా సాగుతోంది. పోలింగ్ స్టేషన్ల వారీగా బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు ఈ కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. ఓటర్ల సర్వేను ఎన్నికల నమోదు అధికారులు, సహాయ అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి నిర్వహించిన సర్వే వివరాలను వెల్లడించడంతో పాటు మృతి చెందిన ఓటర్లు, డబుల్ ఎంట్రీలు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల జాబితాలను ఇప్పటికే రూపొందించిన విషయం తెలిసిందే. వాటిని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసి వాటిపై అభ్యంతరాలు తెలపాలని అధికారులు కోరారు. ఈ అంశంపై మరో పక్క నాయకులు కూడా వివరాలను సేకరిస్తున్నారు.

గాజువాక నియోజకవర్గంలో 3.12 లక్షలకు పైగా ఓటర్లున్నారు. వారిలో ఒకే ఇంటి డోరు నంబర్‌పై పది మందికి పైగా ఓటర్లు చాలాచోట్ల ఉన్నారని, అనేకమంది డోర్ నంబర్ లేకుండా ఉన్నారంటూ ఎన్నికల నమోదు అధికారులకు ఫిర్యాదులు అందడంతో సంబంధిత సిబ్బంది ఆ దిశగా కూడా సర్వే పూర్తి చేశారు. డోర్ నంబర్ లేకుండా 62 మంది ఉన్నట్లు గుర్తించామని అధికారులు ఇప్పటికే వెల్లడించిన విషయం తెలిసిందే. ఒకే డోర్ నంబర్‌లో పది మందికి పైగా ఓటర్లున్నట్టు అందిన ఫిర్యాదుపై సర్వే నిర్వహించిన అధికారులు వాటిపై ప్రాథమిక సమాచారాన్ని సేకరించారు. కొంతమంది అద్దెకు ఇంట్లో ఉండి ఆ తరువాత ఖాళీ చేయడం, తమ ఓటును అక్కడికి మార్చుకోకపోవడం, అదే ఇంట్లోకి కొత్తవారు వచ్చి తమ ఓటును నమోదు చేసుకోవడం వంటి కారణాలరీత్యా ఇలాంటివి ఉన్నట్టు గుర్తించారు. వాటిని త్వరలో చేపట్టనున్న రేషనలైజేషన్‌లో సరి చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ సర్వేను వచ్చేనెల 21లోగా పూర్తి చేసి అక్టోబర్ నాటికి ఓటర్ల రేషనలైజేషన్ పూర్తి చేసే అవకాశం ఉన్నట్టు చెబుతున్నారు. దీనికి రాజకీయ పార్టీలు సహకరించాలని, అభ్యంతరాలను సకాలంలో తెలపాలని కోరుతున్నారు.

68వ వార్డులో..

అక్కిరెడ్డిపాలెం: నియోజకవర్గంలో ఓటర్ల పరిశీలన ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో ఓటర్ల సర్వేను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి శనివారం పరిశీలించారు. బీఎల్‌వోలతో కలసి పలు నివాసాలకు వెళ్లి, డోర్ నంబర్ల ఆధారంగా ఓటర్ల వివరాలను జాబితా ప్రకారం పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ధర్మరాజు, బీఎల్‌వోలు కమలి, ప్రేమ్ కుమార్, అప్పయ్య, సత్యనారాయణ, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణే లక్ష్యం



898వ రోజు ఉక్కు దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు విషయంలో కార్మికులను రోడ్డున పడే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అమానుషమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు దేశవ్యాప్త ఉద్యమాలకు సైతం సిద్ధమని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 898వ రోజు శనివారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ శక్తులకు కట్టబెడితే చూస్తు ఊరుకోబోమన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగిస్తామనే పార్లమెంట్ సమావేశాల్లో ప్రకటన చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కార్మికుల చేతుల్లో స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తు



స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎం సంజీవరావు దంపతులను సత్కరిస్తున్న ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తు ఉక్కు కార్మికుల చేతుల్లో ఉందని స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ (ఐఆర్) జనరల్ మేనేజర్ కె. సంజీవరావు అన్నారు. కోక్‌ఓవెన్స్ విభాగంలో శనివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ప్లాంట్ గతంలో అనేక ఒడిదొడుకులు ఎదుర్కొందన్నారు. ఉద్యోగుల సమష్టి కృషి వల్ల అనేక అవరోధాలను ఎదుర్కొని ముందుకు సాగిందన్నారు. ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కొని ముందుకు సాగేందుకు ఉద్యోగులందరూ సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా సంజీవరావు, ఆశాలత దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌స్ట్రుమెంటేషన్ డీజీఎం కె.ఎస్. జగన్నాథరావు, కిరణ్‌కుమార్, ఎ.దుర్గారావు, ఎల్లేటి శ్రీనివాసరావు, చీకటి శ్రీనివాస్, రామచంద్రరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ జాబితాలో చేర్చాలని వినతి

అగనంపూడి: అన్ని రంగాల్లో వెనుకబడిన శిష్ట కరణం, సోండి, కళింగ వైశ్య, తూర్పు కాపులను ఓబీసీ జాబితాలో చేర్చాలని ఆయా సామాజిక వర్గాల నాయకులు ఎంపీ జీవీఎల్ నరసింహారావును వినతిపత్రంలో కోరారు. విశాఖ ఎయిర్‌పోర్టులో నరసింహారావును కలిసిన నాయకులు పార్లమెంట్ సమావేశాల్లో ఈ సామాజిక వర్గాలను ఓబీసీ జాబితాలో చేర్చే అంశాన్ని ప్రస్తావించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీని కలిసిన వారిలో శిష్ట కరణం అఖిల భారత అధ్యక్షుడు కంటిమహంతి వెంకటేశ్వర బెనర్జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికితోట చంద్రమౌళి, కార్యదర్శి దొంకాడ అనిల్, ఉపాధ్యక్షులు బగ్గం శ్రీనివాసరావు, శేఖరమంత్రి శ్రీనివాసరావు తదితరులున్నారు.

జేసీ దృష్టికి పాఠశాల భవన సమస్య



జేసీకి సమస్యను వివరిస్తున్న కార్పొరేటర్ మూర్తి

గాజువాక: జీవీఎంసీ 65వ వార్డు రాజీవ్‌మార్గ్, భానోజీ కాలనీలోని సామాజిక భవనంలో కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాల భవనం దుస్థితిని కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు (కేబుల్ మూర్తి) జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్‌కు వివరించారు. 20 ఏళ్ల క్రితం నిర్మించిన భవనంలోనే పాఠశాల కొనసాగుతోందని తెలిపారు. శిథిల స్థితిలో ఉన్న ఈ భవనాన్ని తొలగించి కొత్తది నిర్మించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. దీనిపై జేసీ సానుకూలంగా స్పందించినట్టు మూర్తి తెలిపారు.

ఆటోలో మహిళపై మూకుమ్మడి దాడి

- బెదిరించి పుస్తెలతాడు లాక్కున్న దుండగులు
- నిందితులను పోలీసులకు అప్పగించిన స్థానికులు

సబ్బవరం: ఆటోలో ప్రయాణిస్తున్న మహిళను బెదిరించి, పుస్తెలతాడు అపహరించేందుకు ప్రయత్నించిన నలుగురు నిందితులను శుక్రవారం రాత్రి స్థానికులు చాకచక్యంగా పట్టుకుని, పోలీసులకు అప్పగించారు. బాధిత మహిళ, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అసకపల్లి శివారు సున్నంబట్టీలుకు చెందిన పల్లి సూరీడమ్మ డ్వాక్రా సమావేశానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేందుకు శుక్రవారం రాత్రి అసకపల్లి జంక్షన్ వద్ద ఆటో ఎక్కింది. అప్పటికే ఆ ఆటోలో ఇద్దరు మహిళలు, మరో యువకుడు ఉన్నారు. సున్నంబట్టీల వద్ద బ్రిడ్జి కిందకు రాగానే ఆటో ఆపమని కోరగా, ఆటోలోని ముగ్గురూ మూకుమ్మడిగా సూరీడమ్మపై దాడి చేసి, మెడలోని బంగారుతాడును బ్లేడుతో కత్తిరించారు. చంపేస్తామని బెదిరించి తాడు లాక్కున్నారు. సూరీడమ్మ గట్టిగా అరవడంతో ఆటో వెనుక వస్తున్న నోట్ల కృష్ణ, వెంకటేష్ ఆటోకు అడ్డంగా బైక్ నిలిపి నలుగురినీ పట్టుకుని, బంగారు తాడు సూరీడమ్మకు అప్పగించారు. దాడికి పాల్పడిన ఆటో డ్రైవర్ మేకల శ్రీనుతో పాటు ఆటోలో ఉన్న ఇద్దరు మహిళలు గొర్లి రమణి, మేకల లక్ష్మి, మేకల ప్రకాష్‌ను శుక్రవారం రాత్రి పోలీసులకు అప్పగించారు. బాధితురాలు సూరీడమ్మ ఫిర్యాదు మేరకు సీఐ రంగనాథం కేసు దర్యాప్తు చేస్తున్నారు. పట్టుబడ్డ నలుగురు గాజువాకకు చెందిన వారని తెలుస్తోంది. ఆటోను అద్దెకు తీసుకొని ఈ ఘటనకు పాల్పడినట్లు సమాచారం.